# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ దేశంలోనే మొట్టమొదటి "కాగిత రహిత న్యాయవ్యవస్థ" రాష్ట్రంగా సిక్కిం అవతరించిందని భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు.

❖ పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో దేశ ఇంధన అవసరాలకు ఆటంకం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

❖ ఆర్థిక నేరగాళ్ల నుంచి దేశాన్ని రక్షించే "రక్షణ కవచం"లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పని చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కొనియాడారు.

❖ దేశంలోని అధిక ప్రాంతాల్లో మే నెలలో సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహపాత్ర తెలిపారు.

❖ జైపూర్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

======================

న్యాయవ్యవస్థలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ.. సిక్కిం రాష్ట్రం దేశంలోనే మొట్టమొదటి `కాగిత రహిత న్యాయవ్యవస్థ` (Paperless Judiciary) రాష్ట్రంగా అవతరించింది. గాంగ్‌టక్‌లో ఈరోజు నిర్వహించిన సదస్సులో భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఘనత సాధించడంపై సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ గోలే రాష్ట్ర ప్రజలకు, న్యాయమూర్తులకు అభినందనలు తెలిపారు. వేగవంతమైన, పారదర్శకమైన సాంకేతిక ఆధారిత న్యాయ వ్యవస్థను నిర్మించడంలో ఇదొక చారిత్రక అడుగని కొనియాడారు. ఇ-ఫైలింగ్, డిజిటల్ కేస్ మేనేజ్‌మెంట్ వంటి కార్యక్రమాలు న్యాయసేవలను మరింత సమర్థవంతంగా అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో దేశ ఇంధన అవసరాలకు ఆటంకం కలగకుండా చూడటంతో పాటు.. ఆ ప్రాంతంలో ఉన్న భారతీయుల భద్రత కోసం అన్ని రకాల ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఎల్పీజీ (LPG) సిలిండర్ల అక్రమ నిల్వలు, నల్లబజారు విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ తెలిపింది. నిన్న ఒక్కరోజే 2 వేల 300కిపైగా దాడులు నిర్వహించనట్లు వెల్లడించింది. అదే విధంగా 49.8 లక్షల గృహ ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేసినట్లు తెలిపింది. డెలివరీ ఆథెంటిఫికేషన్ కోడ్ ఆధారిత సరఫరాలు 93 శాతంకు పెరిగిందని, పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయ నావికులు అందరూ సురక్షితంగా ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం 2 వేల 490 మంది భారతీయులను భూ సరిహద్దు మార్గాల ద్వారా తరలించిందని పేర్కొంది. పశ్చిమాసియా నుండి విమాన సర్వీసులు మెరుగుపడుతున్నాయని, అదనపు విమానాలు భారత్‌కు నడుస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్థిక నేరగాళ్ల నుంచి దేశాన్ని రక్షించే “రక్షణ కవచం”లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పని చేస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కొనియాడారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన “ఈడీ 70వ వ్యవస్థాపక దినోత్సవ” వేడుకల్లో ఆయన మాట్లాడుతూ... మనీలాండరింగ్, హవాలా లావాదేవీలు, బినామీ ఆస్తులు, కార్పొరేట్ మోసాల వంటి పెను ముప్పులను అరికట్టడమే ఈడీ లక్ష్యమని స్పష్టం చేశారు. అవినీతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న “జీరో టాలరెన్స్” విధానానికి ఈడీ ఒక నిదర్శనమని పునరుద్ఘాటించారు. మార్చి 31 వరకు ఈడీ 2.36 లక్షల కోట్ల రూపాయల ఆస్తులను అటాచ్ చేయగా.. అందులో 63 వేల కోట్ల రూపాయలకు పైగా బ్యాంకులు, ఇన్వెస్టర్లు, గృహ కొనుగోలుదారులు వంటి హక్కుదారులకు తిరిగి ఇచ్చినట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో రేపు రీపోలింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని మగ్రాహత్ పశ్చిమ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 కేంద్రాల్లో తిరిగి ఎన్నిక నిర్వహించనున్నారు. పోలింగ్ రోజున జరిగిన పరిణామాలు, రిటర్నింగ్ అధికారులు, పరిశీలకులు సమర్పించిన నివేదికల ఆధారంగా కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బుద్ధ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని లద్దాఖ్‌లోని లేహ్‌లో గల జీవత్సల్‌లో ‘బుద్ధుని పవిత్ర అస్థికల ప్రదర్శన’ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. సుమారు 75 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ పవిత్ర అస్థికలు లద్దాఖ్ పుణ్య భూమికి రావడం విశేషమని ఆయన పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక ప్రదర్శన కోసం వీటిని లద్దాఖ్‌కు తరలించారు. నేటి నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. గౌతమ బుద్ధుడు పరమపదించిన 2,500 ఏళ్ల తర్వాత కూడా ఆయన బోధనలు నేటికీ ఆచరణీయంగా ఉన్నాయని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

గత ఏప్రిల్ నెలలో వస్తు సేవల పన్ను (GST) వసూళ్లు రికార్డు స్థాయికి చేరాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 8.7 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం జీఎస్టీ వసూళ్లు 2 లక్షల 42 వేల కోట్ల రూపాయలకు పైగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో 2 లక్షల 23 వేల కోట్లుగా ఉండగా, ఈసారి మరింత పెరిగాయి. గత నెలలో కేంద్ర జీఎస్టీ వసూళ్లు 52 వేల కోట్ల రూపాయలకు పైగా ఉండగా, రాష్ట్ర జీఎస్టీ 61 వేల 300 కోట్ల రూపాయలకు మించి నమోదయ్యాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హర్షం వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంలో ఈ పథకం కోట్లాది కుటుంబాల్లో నిజమైన మార్పును తీసుకువచ్చిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నారు. ఈ పథకం లక్షలాది మంది మహిళలను ఆర్థికంగా, సామాజికంగా సాధికారులను చేయడమే కాకుండా.. ఆరోగ్యవంతమైన భారతదేశానికి బలమైన పునాది వేసిందని ఆయన వివరించారు. ఒకప్పుడు పొగతో నిండిన వంటిళ్లలో ఇబ్బందులు పడ్డ తల్లులకు ఈ పథకం భద్రతను, గౌరవాన్ని ఇచ్చిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ భద్రత, ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణల అద్భుత కలయికకు 'గ్రేట్ నికోబార్' ప్రాజెక్టు ఒక నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక వృద్ధిని కాపాడుకుంటూనే.. పర్యావరణ సమతుల్యతను, గిరిజన సంక్షేమాన్ని ఎలా సమన్వయం చేయవచ్చో ఈ ప్రాజెక్టు చాటి చెబుతోందని స్పష్టం చేసింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి గ్రేట్ నికోబార్ భౌగోళిక స్థానం ఎంతో కీలకమని ప్రభుత్వం వివరించింది. ఈ ప్రాజెక్టు ద్వారా జాతీయ భద్రత బలపడటంతో పాటు, సముద్ర తీర రక్షణ రంగాలు మరింత పటిష్టం కానున్నాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA) అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం భారతీయ రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సరికొత్త అవకాశాలను కల్పించిందని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో భారత్-యూఏఈల మధ్య ద్వైపాక్షిక వస్తు వాణిజ్యం గణనీయంగా వృద్ధి చెంది, 100 బిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించిందని కేంద్రమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

డెన్మార్క్‌లోని హోర్సెన్స్‌లో జరిగిన థామస్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లో చైనీస్ తైపీపై భారత్ 3-0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌కు ప్రవేశించింది. ప్రారంభ మ్యాచ్‌లో లక్ష్యసేన్ అద్భుత ప్రదర్శనతో ప్రపంచ 6వ ర్యాంక్ ఆటగాడు చౌ టియెన్ చెన్‌ను ఓడించి భారత్‌కు విజయారంభం అందించాడు. అనంతరం సాత్విక్ సాయి రాజ్ – చిరాగ్ శెట్టి జంట చియు సియాంగ్ చీహ్, వాంగ్ చి-లిన్ జంటపై గెలిచి ఆధిక్యం పెంచింది. మూడో మ్యాచ్‌లో అయుష్ శెట్టి లిన్ చున్-యీపై విజయం సాధించడంతో 3-0తో భారత్ సెమీస్ కు చేరుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా జైపూర్‌లోని సువాయ్ మాన్ సింగ్ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన రాజస్థాన్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా మే నెలలో ఉష్ణోగ్రతలు, వర్షపాతానికి సంబంధించి భారత వాతావరణ విభాగం (IMD) ఈరోజు నెలవారీ అంచనాలను విడుదల చేసింది. ఈ మేరకు ఐఎండీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహపాత్ర వివరాలను వెల్లడించారు. దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో మే నెలలో సాధారణం లేదా దాని కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అయితే... తూర్పు, ఈశాన్య భారతంతో పాటు తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య, వాయువ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =